
కథ

రాత్రి భోజనాలయ్యాక వంటిల్లు కడిగి ఇంటిల్లిపాదీ నిద్రపోవడానికి సిద్ధమయ్యారు-అంతకన్నా ఆ రాత్రి అప్పుడు ఇంకేదీ చేసేదీలేక. అక్కకు వయసు ఏభై ఏళ్లు. భార్యకు నలభై; కూతురికి పదమూ డేళ్లు.

# పాపభీతి

నేతి శివరామశర్మ



వాళ్లపని ఎంతసేపటికీ తెమలక పొయ్యేసరికి సీతాపతికి కోపం వచ్చింది. నిద్ర ముంచుకొచ్చింది.

'ఎక్కడన్నా దూకి చావండి!' అంటూ శాపనార్థాలు పెడ్తూ పడక గదిలోకి దూరాడు.

అరగంటైనా సరిగ్గా నిద్రపోయాడో, లేదో ఇంటి వెదురు బొంగుమీద ఏదో పరిగెత్తిన ట్టనిపించింది. కొద్దిగా కదిలి శబ్దం చేసింది. ఎలుకో, ఏదో దాని మీద పరిగెత్తింది అనుకొని సమాధానపడ్డాడు సీతాపతి.

రెండు నిమిషాలు గడిచాయి. మళ్లీ శబ్దం. ఎలుక వెదురు బొంగుపైకి ఎక్కుతోం దనిపించింది.



అక్కడ గోడ కానించిన ఇత్తడి పళ్లెం గలగలా శబ్దం చేసింది. ఎలుక కాళ్లతో గీకిన శబ్దం. కాసేపటికి కాగితపు బొంతలమీద పరుగిడిన శబ్దమైంది. ధడక్ ధడక్ మని ఎలుక కొయ్య బీరువా మీద దూకిన శబ్దం వినిపించింది. దానిమీద పెట్టిన ఖాళీ డబ్బాలు దభీమని కిందపడ్డాయి. అక్కడనుంచి కొయ్య షెల్ఫ్ మీదికి దూకింది. చీలకు వేలాడే కొయ్య షెల్ఫ్ కిందపడి ముక్కలుముక్క లైంది. తర్వాత కొంతసేపటివరకు నిశ్శబ్దం ఆవరించింది ఇల్లంతా. బహుశా ఆ శబ్దానికి ఎలుక భయపడి ఉండొచ్చు అనుకున్నాడు సీతాపతి. తర్వాత మళ్లీ శబ్దం-ఈసారి పైనున్న డబ్బాలు శబ్దం చేస్తూ దొర్లుతూ కిందపడ్డాయి. సీతాపతి, ఆయన భార్యా లేచి లైటు వేశారు. నూనె సీసా కిందపడి పగిలిపోయింది. డబ్బాల్లో ఉన్న కందిపప్పు, పెసరపప్పు మూత వీడి కిందపడి ఇల్లంతా పరుచుకున్నాయి. సీతాపతి భార్య రాధ కిందపడ్డ పప్పు మళ్లీ డబ్బాల్లో పోసి మూతలు పెట్టింది. దానిమీద ఒక గంపను బోర్లించింది జాగ్రత్తకోసం.

'ఎలుక కోసం ఏదైనా ఒకటి మిగుల్చమన్నానా...ఎందుకు వింటావు నా మాట!' గదమాయించాడు భార్యను సీతాపతి.


'ఏం అట్టేపెట్టమంటారు--ఒక స్పూను చారుసీళ్లా, లేక ఒక్క గరిటే ఉప్మానా!' అంది విసుగ్గా రాధ.

'నీ గురించి నువ్వు అసలు ఏమనుకుంటున్నావు?' భార్యను దబాయించాడు.

'నేనా...నా గురించి నేనేం అనుకోడం లేదే! వడో, దోశో, ఉప్మానో--ఏదైనా మిగిల్తే ఎలుక కోసం అట్టే పెట్టొచ్చు! అవి మనకే లేవు మింగడానికి... దాని కెక్కణ్ణుంచి వస్తాయి!' అంది విసుగ్గా రాధ.

అందులో సీతాపతికి కాస్త వెటకారం కనిపించింది. 'అయితే రమ్మను రోజూ ఎలుకను; నూనెను, పప్పుల్ని నాశనం చెయ్యమను!'

రాధలో ఉలుకూ పలుకూ లేదు. స్థాణువులా నిలబడింది భర్తమాటలు వింటూ. కొంతసేపటి తర్వాత లోపలికెళ్లి ఎండిపోయిన ఒక ఎర్రగడ్డను తెచ్చి భర్త చేతికిచ్చింది. 'కావాలంటే దీనిని ఆహారంగా దానికి పెట్టండి!'అంది.



'ఈ ఎండిపోయిన ఎర్రగడ్డకోసం వస్తుందా ఎలుక!' అంటూ సీతాపతి కోపంగా భార్యమీదికి విసిరాడు ఎర్రగడ్డను.


ఆమె అదృష్టం బాగుండి కొంచెంలో తప్పిందిగాని లేకపోతే అది ఆమె కణతకు తగిలి ఉంటే ప్రమాదమే జరిగి ఉండేది. రాధ అక్కడినుండి లోపలికెళ్లిపోయింది.

సీతాపతికి నిద్ర పట్టలేదు. ఇంట్లో ఉన్నవే రెండు గదులు. పదిమంది నిద్రపోవాలి ఎలా! తప్పదు మరి; అంతకన్నా పెద్ద ఇల్లు బాడుగకు తీసుకొని భరించే శక్తి తనకు లేదు, గనుక. అందులోనే ఎలుకలు కూడా స్వేచ్ఛగా కాపురం చేస్తాయి తమతో కూడా. రోజూ పప్పు డబ్బాలమీద మూతలు తీస్తూ, నూనె సీసాలు పగులకొడ్తూ, ఉన్న గుడ్డల్ని కొట్టేస్తూ, టొమాటోలు, ఆలుగడ్డల్ని కొరికేస్తూ, దేవుడి దగ్గర దీపం వెలిగిస్తే ప్రతిరోజూ తప్పనిసరిగా వొత్తిని లాక్కెళ్తూ నూనె కింద పోస్తూ బాధిస్తున్నాయి ఎలుకలు.

సీతాపతి లేచాడు. ఒక పావలా బిళ్ల జేబులో వేసుకొన్నాడు; తలుపు తాళం వేసి బైట కెళ్లాడు.



హోటళ్లన్నీ మూసేశారు. అక్కడక్కడా ఒకటి రెండు కిళ్లీ షాపులు, టీ బంకులు మాత్రం ఇంకా తీసి ఉన్నాయి. ఎలుక కోసం వడ దొరుకుతుందేమోనని సీతాపతి ప్రయత్నం. ఎక్కడా వడలు అమ్ముతున్నట్టు కనిపించలేదు. రొట్టెలు, బిస్కెట్లు, అరటిపండ్లు మాత్రం కనిపిస్తూ ఉన్నాయి. ఇంతకుముందు ఎన్నిసార్లో వాటిని పెట్టి ఎలుకను పట్టుకోడానికి ప్రయత్నంచేసి విఫలు డయ్యాడు సీతాపతి. కాబట్టి ఈసారి ఎలుకను పట్టుకోడానికి మరేదైనా గట్టి ప్రయత్నం చేయాలని తీర్మానించుకున్నాడు. వాటిని ముక్కుతో వాసన కూడా చూళ్లేదు కితం సారి. బహుశా అది నూనెతో చేసిన పిండివంటలు మాత్రం తింటుందేమో అనిపించింది. వడలు, పకోడీలు, అప్పడాలు నూనెధర పెరిగింది కనక ఇంట్లో తయారుచేయించి పెట్టలేడు. నూక ఉప్మా, రవ ఉప్మా, పొంగలి ఇంట్లో చేయించి ఒకటి తర్వాత ఒకటి పెట్టి ప్రయత్నించవచ్చు అనుకున్నాడు. ఉప్మా, పొంగలి అంటే తనకు మాదిరే ఎలుకకు కూడా ముఖం మొత్తిందేమో తినడం మానేసింది; క్రితం ఒకసారి పెడితే తినలేదు.



దూరంగా ఏదో అలజడి...చూచాడు సీతాపతి. ఓ ముప్పై నలభై మంది గుంపుగా చేరిన ఏదో మీటింగులా ఉంది. ఎవరో వ్యక్తి చేతులు తిప్పుతూ ఉపన్యాసం చేస్తున్నాడు. ఆ ఉపన్యాసాన్ని తానూ ఎందుకు వినకూడదు అనుకుని అటువైపు నడిచాడు. ఆయన ఆ ఉపన్యాసంలో ఇతర దేశాల్ని బెదిరిస్తున్నాడు. అలాగే తన ఇంట్లో ఉన్న ఎలుకను గూడా బెదిరించవచ్చుగదా! అప్పు డది బెదిరిపోయి ఊరు వదిలి ఏ అడవిలోనో, సముద్రంలోనో కాపురం పెట్టేదిగా. కాని, పాపం వాటికి ఈ బెదిరిస్తున్న భాష అర్థం కాదు కాబోలు అనుకున్నాడు సీతాపతి.

ఆ గుంపులోవాళ్లు కొందరు పక్కన ఉన్న తోపుడు బండిమీద వడలు వగైరా చేసేవాడి చుట్టూరా చేరారు. వాడు మిరపకాయ బజ్జీలు, వడలూ వేస్తూ వాటిని అమ్మేస్తున్నాడు. సీతాపతి కూడా ఆ బండి దగ్గరకెళ్లాడు. సబ్ మెరిన్లు నీటిలో మునిగినట్లు బండివాడు వేసే మిరపకాయ బజ్జీలు నూనెలో మునుగుతున్నాయి. ఒక వ్యక్తి కారు దిగి, 'పది మిరపకాయ బజ్జీలు కట్టు' అని ఆర్డర్ వేసి చీకట్లో బరువు తీర్చుకోవడాని కెళ్లాడు.

'ఈసారి ఒక వాయ వడ వేయి!' ఎవరో వెనకనుంచి అరిచారు.

అలాగే అంటూ బండివాడు ఈసారి కూడా మిరపకాయబజ్జీలే వేశాడు.

'వడ లడిగారా...ఎన్ని కావాలి, సార్?' అన్నాడు బండివాడు మాటల్తో మభ్యపెడుతూ.

## బహిష్టు నొప్పులకు చాక్లెట్ మందు!

ఇదేదో చాలా బాగున్నట్లుంది కదూ? బహిష్టు రావటానికి ముందు చాలా మంది స్త్రీలకు చాక్లెట్లు తినాలనే కోరిక తీవ్రంగా కలుగుతుందట. అందుక్కారణం శరీరంలో మెగ్నీషియం స్థాయి తక్కువ కావటమే. బహిష్టు సమయంలో శరీరంలో మెగ్నీషియం అధికంగా కావాలి. ఆ మెగ్నీషియం చాక్లెట్లలో వుంటుంది కనుక చాక్లెట్లు తీసుకోవాలి. పైగా మెగ్నీషియం బహిష్టులో కలిగే నొప్పి, అసహనాలను తగ్గిస్తుంది. కనుక మెగ్నీషియం ఎక్కువగా వుండే ఆకుకూరలు, అరటికాయల వంటి పచ్చని కూరలు, ఆలుగడ్డలు ఎక్కువగా తీసుకోవాలంటున్నారు.

ఎస్.

'ఒకటి కాదు; రెండు!' అన్నాడు సీతాపతి.

బండివాడు వెటకారంగా నవ్వి 'ఒక వడ కోసం వాయ వెయ్యమంటారా' అన్నాడు. 'కాస్త ఉండండి ఇంకా వడలు కావాలని వాళ్లు వస్తారేమో చూద్దాం!' అన్నాడు మళ్లీ కాగుతున్న నూనెలో బజ్జీలు వేస్తూ.

వడలకోసం కాచుక్కూర్చున్న మరో వ్యక్తి విసుగేసి అరిచాడు--'ఎంతసేపు ఉండ మంటావోయ్ నీ వెధవముండా వడల కోసం!' అని.

'అక్కడ నిలుచున్న ఆయన కూడా వడలకోసమే ఉన్నాడు చాలాసేపటినుంచి ఓపిగ్గా చూడండి' అన్నాడు బండివాడు.

సీతాపతిలో ఓపిక చచ్చిపోయింది. కాని చుట్టూరా చూశాడు. ఎంతమందో బండి చుట్టూ నిలబడి ఉన్నారు తినడానికి. కాని, తనకు కావల్సిన వడలు తాను తినడానికి కాదు; ఎలుక కోసం అనుకొన్నప్పుడు ఒకరకంగా సిగ్గు, బాధ కలిగాయి సీతాపతికి.

బండివాడు ఏమనుకున్నాడో ఏమో సీతాపతి వైపు పాపం అన్నట్టు సానుభూతిగా చూచి రెండు వడలు పాత పేపర్లో పొట్లం కట్టి ఇచ్చాడు అందరి కన్నా ముందు. కాని వేడి వడలకున్న నూనెతో చేతులు కాలాయి.

ఇంటికి బయల్దేరాడు సీతాపతి. వాసన గుబాళిస్తున్నా, చేతులు కాల్తున్నా ఆ వేడి భరిస్తూ ఒక చేతిలోంచి మరో చేతిలోకి మార్చుకొంటూ అంత కష్టపడి తెస్తున్న వడలు ఎలుక కోసమని బండి వాడికేం తెలుసు పాపం. తన కనుకొని అందరికన్నా ముందు తన కిచ్చాడు వెధవ.

చేతులనిండా చమురైంది. తాళం చెవి జేబులో ఉండిపోయింది. నూనె షర్టుకు తుడుచుకున్నాడు.

ఇంటికి పోయాక ఎలుకబోనులో ఉన్న కమ్మికి ఒక వడను గుచ్చాడు. మరొకటి తాను తిన్నాడు.

ఏభై ఏండ్ల వ్యక్తి రాత్రి వడలు తింటే ఆ ఫలితాలు వేరు అనుకొంటూ నిద్రలో కెళ్లాడు. రాత్రి తిన్న వడ సీతాపతిని ఉదయాన్నే లేచేటట్టు చేసింది; కడుపులో గుడగుడ చేస్తూ.

బోను వైపు చూశాడు. వడకు ఆశపడి ప్రాణానికి తెగించిన ఎలుక బోనులో పడింది. ఎవడైనా ఆశకు పోతే ఇంతే కాబోలు అనుకొన్నాడు సీతాపతి. రాత్రంతా ఎలుక శబ్దం చేస్తూనే ఉంది కాని, నిద్రలో సీతాపతి వినలేదు. ఏమీ పట్టించుకోనూ లేదు.

ఎలుకను ఎక్కడికన్నా తీసికెళ్లి వదలాలి. అది సీతాపతి తర్వాతి కార్యక్రమం. బోను పట్టుకొని బయల్దేరాడు.

ఎలుక బోను సందుగుండా దీనంగా చూచింది సీతాపతివైపు-ఉరివేయడానికి తీసుకుపోబడ్తున్న హంతకుడిలా. అదే పెద్ద ఎలుకైతేనో...బోనును కొరికి వెలువలికి పోయి ఉండేది. పాపం ఇది చిన్న ఎలుకైంది అనుకొన్నాడు సీతాపతి సానుభూతిగా. కాని ఇప్పుడు దాని ప్రాణరక్షణ తన చేయి దాటిపోయింది. కాని ఇక మీద డబ్బాలు దొర్లడం, పప్పులు పాడవడం, దీపారాధన వొత్తిని లాక్కెళ్లడం లాంటివి ఉండవనుకొన్నప్పుడు ఎక్కడలేని సంతోషంతో సీతాపతి ముఖం తృప్తిగా వెలిగిపోయింది. దానిని పట్టుకొన్న సీతాపతి కార్గిల్ యుద్ధంలో గెలిచిన యుద్ధవీరుడిలా గర్వంగా ఫీలయ్యాడు.

బైటకి వదిలేస్తే బహుశా ఇల్లు గుర్తుంచుకొని ఎలుక మళ్లీ తనింటికి తిరిగి రావచ్చు అనుకున్నప్పుడు బాధగా మూల్గాడు సీతాపతి. మళ్లీ బండివాడు, వడలకోసం పడిగాపులు కాయడం, వాసన గుబాళించడం, వేడినూనెకు చేతులు కాలడం, వడలను ఎగరేస్తూ చేతులు మార్చుకోవడం--అలా మళ్లీ జరగకూడదు అనుకున్నాడు.

ఎలుక బోనును చూచి రెడీగా కొట్టి చంపడానికి చేత్తో రాళ్లు పట్టుకుని సిద్ధంగా ఉన్నారు పిల్ల వెధవలు--బోను తలుపు ఎప్పుడెప్పుడు తీస్తాడా అని ఎదురుచూస్తూ

సీతాపతి బోను తలుపు తీశాడు. బతికాములా దేవుడా అంటూ ఎలుక ఒక్కసారి గెంతింది బోనులోంచి. అటు ఇటూ బిత్తర బిత్తరగా పరుగెత్తింది. ఎవడో రాయితో కొట్టాడు ఎలుకను.


'వద్దు, బాబూ, దాన్ని చంపకు' అంటూ కుర్రాణ్ణి బ్రతిమాలాడు సీతాపతి.

ఎక్కణ్ణించి వచ్చిందో ఎగురుకుంటూ యమదూతలా ఒక కాకి....కాళ్లతో ఎలుకను తన్నుకుపోయింది. ఎలుక వెల్లకిలా పడింది. కాకి ఎలుక చుట్టూ తిరిగింది. ముక్కుతో పొడిచింది. ఎలుకకు దాక్కోవడానికి చోటు లేకపోయేసరికి ఈసారి కాకి ఎలుకను గట్టిగా పొడిచి తన్నుకుపోయింది.

సీతాపతి మనసును ఆశ్చర్యం, పాపభీతి కలచివేశాయి. ఖాళీ బోను పట్టుకొని ఇంటి ముఖం పట్టాడు సీతాపతి--దిగులుగా చేసిన పాపాన్ని తల్చుకుంటూ.

బోను లోపల చూశాడు. ముందురోజు రాత్రి హుక్కుకు గుచ్చిన ఎలుక తినగా మిగిలిపోయిన ఎండిపోయిన సగం వడ చేసిన పాపానికి సీతాపతిని శపిస్తోందా అన్నట్టు అనిపించింది.

(వసంత సూర్య రాసిన లిటరరీ రివ్యూ 'ది రాట్'-THE RAT(The Hindu: 3-9-2000లో) చదివాక) ■



## అనిల్ కపూర్ త్యాగం

ఫ్లాప్ చిత్రాల నిర్మాతగా పేరు పడిన బోనీకపూర్ (అహా, సాక్షాత్తూ మన శ్రీదేవి మొగుడే!), కోట్ల రూపాయల ఖర్చుతో ఇటీవల తీసిన 'బధాయీ హో బధాయీ' కూడా దెబ్బ తినేసింది. అయినా ఏమీ బాధ పడకుండా బోనీ, ఇప్పుడు మరో మూడు సినిమాలు తీయటానికి సిద్ధమైపోయాడు. ఓ దాంట్లో బిగ్ బీనీ, మరో దాంట్లో అక్షయ్ కుమార్‌నూ, మరో దాంట్లో తమ్ముడు అనిల్ కపూర్‌నూ తీసుకోదలచాడు. కానీ అనిల్ మాత్రం, చిన్న తమ్ముడు సంజయ్ కపూర్‌కే ఆ చిత్రం వదలదలిచాట్ట. తనకెలాగూ పేరుంది. పాపం, కెరీర్‌లో కాస్త వెనకబడ్డ వాడికి సాయం చేస్తే తప్పేమిటి? అనుకున్నాడో ఏమిటో! సొంత చిత్రమే కదా, పోతే తమ్ముడి పేరు పోతుంది, ఎటు తిరిగి ఎటొచ్చినా, తాను తప్పించు కోవచ్చు కదా అనే ఎత్తు కూడా వుండుండొచ్చని కొందరి అభిప్రాయం.

ఎస్.